


జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ

కల్వకుర్తి పరిధిలోని కొట్ర గేటు వద్ద కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, నాయకులు బాలాజీసింగ్, సూదిని పద్మారెడ్డి, కాయితీ సాయిరెడ్డి, కాయితీ ఆశాదీప్ రెడ్డి, బృంగి ఆనంద్‌కుమార్, షానవాజ్‌ఖాన్, జైపాల్‌రెడ్డి కుటుంబీకులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. చిత్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి పట్టణంలో అభివాదం చేస్తున్న సీఎం



సీఎంను చూసేందుకు తరలొచ్చిన జనం



జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం.. చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు

పుట్టిన గడ్డకు.. వరాల జల్లు

- కల్వకుర్తికి తొలిసారి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరు
- రూ.180 కోట్లతో తండాలకు రోడ్లు
- తాను చదువుకున్న పాఠశాలకు రూ.5 కోట్ల ప్రత్యేక నిధులు
- జైపాల్‌రెడ్డి స్వగ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు
- మాడ్గుల మండలంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- కల్వకుర్తి ఆస్పత్రి వంద పడకలకు పెంపు
- ఆమనగల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడి



సభకు హాజరైన ప్రజలు

నాగర్‌కర్నూల్/కల్వకుర్తి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఆదివారం పుట్టిన గడ్డ కల్వకుర్తికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. నాలుగు గంటలకు హెలికాప్టర్ ద్వారా రావాల్సి ఉండగా, వర్షం కారణంగా 55 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. సీఎంకు అపూర్వ స్వాగతం లభించింది. అప్పటికే బీఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు వచ్చిన జనాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. సభకు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడిన తర్వాత సీఎం ఉద్వేగంగా ప్రసంగించారు. తన ప్రసంగంలో కల్వకుర్తి రాజకీయ చైతన్యం గురించి, ఈ ప్రాంతంతో తన అనుబంధం గురించి ప్రధానంగా ప్రస్తావించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పుట్టపాగ మహేంద్రనాథ్, సూదిని జైపాల్‌రెడ్డి, ఎడ్మ కిష్టారెడ్డి లాంటి నిజాయితీ గల రాజకీయ నాయకులు భవిష్యత్తు తరాలకు ఆదర్శప్రాయమన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ, వారి ఆదర్శాలను పుణికిపుచ్చుకోవాల్సిన బాధ్యత ప్రతీ రాజకీయ నాయకుడిపై ఉందన్నారు. జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా మీ బిడ్డను ఆదరించారని, భుజాన ఎక్కించుకుని తిప్పారని అన్నారు. మీ కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత తనపై ఉందని కల్వకుర్తికి వరాలు ప్రకటించారు. 10 కోట్ల రూపాయలతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఆమనగల్‌లో ప్రారంభించనున్నట్లు చెప్పారు. అందుకు ఆగస్టు ఒకటిన అంకురార్పణ చేస్తామన్నారు. సూదిని జైపాల్‌రెడ్డి జన్మించిన మాడ్గుల మండల కేంద్రంలో భూగర్భ డ్రైనేజీ పనులకు రూ.7.75 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అదే మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.8.3 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఐదు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.15 కోట్లు, కల్వకుర్తి పట్టణంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి రూ. ఐదు కోట్లు, పంచాయతీ రోడ్లకు రూ.78 కోట్లు ఇస్తామన్నారు. రూ.163 కోట్ల వ్యయంతో రహదారులు, భవనాల శాఖ నిర్మాణాన్ని చేపడుతామన్నారు. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి మీదుగా శ్రీశైలం వెళ్లే రహదారి నాలుగు లేన్లుగా విస్తరణ పనులకు శ్రీకారం చుట్టిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తాను చదువుకున్న తాండ్ర ప్రభుత్వ పాఠశాలకు తక్షణం ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసిన సీఎం.. తండాల నుంచి మండలానికి రోడ్ల నిర్మాణానికి రూ.180 కోట్ల రూపాయలు ఇస్తామన్నారు. కల్వకుర్తి ఆస్పత్రిని వంద పడకల స్థాయికి పెంచుతున్నామని, ఆమనగల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.109 కోట్ల రూపాయల చెక్కును సీఎం అందించారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో కల్వకుర్తికి చెందిన కొందరు మహిళలు తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తుంది: దామోదర



జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు దొరలు, కుటుంబ పాలనను దించి, కాంగ్రెస్సే ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని అధికారం ఇచ్చారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధితో పాటు ఇచ్చిన హామీలను అమలు పరిచి చరిత్ర సృష్టిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ యువతలో ఉన్న నైపుణ్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డితో తన తండ్రికి మంచి సంబంధం ఉండేదని గుర్తు చేశారు. తెలంగాణ పోరాట సమయంలో కాంగ్రెస్ అధిష్ఠానాన్ని జైపాల్‌రెడ్డి ఒప్పించారని అన్నారు. జైపాల్‌రెడ్డి తత్వవేతగా, జాతీయ నాయకుడిగా ఎదిగిన మహానేత అని కొనియాడారు.


కల్వకుర్తి అభివృద్ధికి నిధులు ఇవ్వండి: కశిరెడ్డి

కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. కల్వకుర్తికి 100 పడకల ఆస్పత్రి, రోడ్ల అభివృద్ధికి రూ.700 కోట్లు, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజ్, ఆమనగల్లుకు డిగ్రీ కళాశాల భవనం మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. వెల్దండ మండలంలోని చెర్కూర్ సమీపంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, తాండ్ర స్కూల్‌కు రూ.50 లక్షలు, రైతులకు పెండింగ్‌లో ఉన్న భూ నష్టపరిహారం రూ.16 కోట్లు మంజూరు చేయాలని, చారకొండ మండలంలోని గోకారం చెరువును పునఃనిర్మించాలని కోరారు.

నల్లమలను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలి: వంశీకృష్ణ

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణకు ఊటీ లాంటి ప్రాంతంగా ఉన్న నల్లమలను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని సీఎంను కోరారు. నల్లమల అడవిలో ఔషధ మొక్కలు ఉన్నందున ఔషధ కళాశాల మంజూరు చేయాలన్నారు.

ఈ ప్రాంత దశ మారనుంది: జూపల్లి



రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి కావడంతో ఈ ప్రాంత దశ దిశ మారనుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరు జిల్లా అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధిస్తుందన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం(కేఎల్ఐ) రూపకల్పన కోసం కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పని చేశారని గుర్తు చేశారు. కేఎల్ఐకి జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని కోరారు.

ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేయాలి: మల్లు రవి

ఎంపీ మల్లురవి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేయడంతో ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సీఎంను కొనియాడుతున్నారని అన్నారు.

జైపాల్‌రెడ్డి అడుగు జాడల్లో నడుద్దాం: వంశీచంద్‌రెడ్డి

కల్వకుర్తి పేరును ప్రపంచ వ్యాప్తంగా గుర్తు చేసిన సూదిని జైపాల్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి అభివృద్ధికి ఎమ్మెల్యే కోరిన వాటిని సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేముల నరేందర్‌రెడ్డి, కలెక్టర్ బాదావత్ సంతోష్, మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, నాయకులు రాఘూర్ బాలాజీసింగ్, బృంగి ఆనంద్‌కుమార్, కాయితి ఆశాదీప్‌రెడ్డి, కాయితి శాయిరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సూదిని రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న సీఎం.. చిత్రంలో ఎంపీ మల్లు రవి, వంశీచంద్‌రెడ్డి



రేకులపల్లి వద్ద నీట మునిగిన పంట పొలాలు

మళ్లీ మునక

- లోయర్ జెన్‌కో వద్ద కృష్ణానదికి వరద తాకిడితో నీట మునిగిన పంటలు, తోటలు
- ముంపునకు గురవుతున్న భూముల సేకరణకు పూర్తయిన సర్వే
- 67.30 ఎకరాలకు రూ.6 కోట్లు పరిహారం చెల్లించేందుకు నిర్ణయం
- మొదటి విడత నిధులు మంజూరైనా రైతులకు అందని డబ్బులు

గద్వాల, జూలై 28: కృష్ణానదికి వరదలు పోటెత్తడటంతో లోయర్ జెన్‌కో వద్ద పంటలు నీట మునిగాయి. కృష్ణానదికి మూడు లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తే జోగుళాంబ గద్వాల జిల్లా రేకులపల్లి గ్రామం వద్ద ఏటా పంటలు మునుగుతున్నాయి. నీట మునిగే పంట పొలాలను భూసేకరణ చేసి, పరిహారం ఇవ్వాలని రైతులు పోరాటం చేశారు. వారి పోరాటం ఫలించినా ఇప్పటి వరకు పరిహారం అందలేదు. మళ్లీ వరద రావడంతో పంటలు మునిగాయి.

నీటి కోసం ఆనకట్ట నిర్మాణంతో..

గద్వాల మండలం రేకులపల్లి గ్రామం వద్ద లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రం పనులు 2008లో ప్రారంభించి, 2014లో పూర్తి చేశారు. 2015 నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. అందుకోసం నీటిని తీసుకోడానికి కృష్ణానదిపై ఆనకట్ట నిర్మించారు. దాంతో నది ప్రవాహం వెనక్కి వెళ్లి, పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఆనకట్టకు 299 మీటర్ల ఎత్తు వద్ద నీళ్లు ఉన్నప్పుడు ముంపునకు గురవుతున్న భూములను సేకరించి, అప్పట్లో పరిహారం చెల్లించారు. ఆ భూములు కాకుండా.. నదీకి మూడు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ వరద వస్తే ఆనకట్టకు రెండు వైపులా వందల ఎకరాల్లో భూములు ముంపునకు గురవుతున్నాయి. పంటలు నీట మునిగి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు.


ఫలించిన పోరాటం

నీట మునిగిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు కలెక్టరేట్, లోయర్ జెన్‌కో ముందు ధర్నాలు చేశారు. అప్పట్లో తాత్కాలిక ఉపశమనం కింద ఎకరాకు రూ.12 వేల చొప్పున 2015 నుంచి 2018 వరకు పంట పరిహారం ఇచ్చారు. కానీ శాశ్వత పరిష్కారం కావాలని రైతులు ఉద్యమించడంతో ఎట్టకేలకు భూసేకరణకు విద్యుత్ అధికారులు అంగీకరించారు. గతంలో 299 మీటర్ల వద్ద ముంపునకు గురవుతున్న భూములను సేకరించిన జెన్‌ కో అధికారులు దానిని 301 మీటర్లకు పెంచి, నీట మునిగే పంట పొలాలను నివేదించాలని రెవెన్యూ అధికారులను కోరారు. సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు భూ సర్వే చేశారు. 120 మంది రైతులకు చెందిన 67.30 ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని నివేదించారు.

అందని పరిహారం

67.30 ఎకరాల భూములకు సంబంధించి రైతులకు దాదాపు రూ.ఆరు కోట్ల పరిహారం చెల్లించాలని లోయర్ జూరాల జల విద్యుత్ అధికారులు అంచనా వేశారు. మొదటి విడతగా వారు రూ.4.32 కోట్లను ఆర్డీవో ఖాతాలో ఫిబ్రవరి 17వ తేదీన జమ చేశారు. మిగిలిన మొత్తాన్ని మొదటి విడత పరిహారం పంపిణీ పూర్తయిన తర్వాత చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కానీ రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేయలేదు. మళ్లీ ఈ ఏడాది వరద రావడంతో వరి పంట, నారు మళ్లు, పండ్ల తోటలు నీట మునిగాయి. అయితే ఈసారి కృష్ణానదికి వరదలు ముందే రావడంతో వరి 50 ఎకరాల్లో మాత్రమే మునిగింది. పూర్తిగా నాట్లు వేసిన తర్వాత వరద వచ్చి ఉంటే నష్టం మరింత ఎక్కువగా ఉండేది.

నల్లమల పులుల అడ్డా



నల్లమల అడవి

- అడవిలో పెరుగుతున్న పెద్ద పులుల సంఖ్య
- వాటి నివాసానికి అనువైన ప్రాంతంగా అమ్రాబాద్ అభయారణ్యం
- 2022 లెక్కల ప్రకారం.. 33 పెద్ద పులులు, 170 చిరుతలు
- సంరక్షణ కోసం అటవీ శాఖ ప్రత్యేక చర్యలు
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం



సీసీ కెమెరా తీసిన పులుల ఫొటో

మన్ననూర్, జూలై 28: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ అభయారణ్యం పెద్ద పులులకు ఆవాసంగా మారింది. దేశంలోనే రెండో అతి పెద్ద పులుల అభయారణ్య ప్రాంతంగా పేరున్న ఈ నల్లమల అడవిలో పులుల సంరక్షణకు అటవీ శాఖ పలు కార్యక్రమాలను చేపడుతోంది. అడవిలో పెద్దపులులతో పాటుగా చిరుతలు, చుక్కల దుప్పులు, నెమళ్లు, సాంబారు, కణితి, మనుబోతు, అడవి పిల్లి, అడవి కుక్క, అడవికోళ్లు, ఎలుగుబంట్లు, మూషిక జింకలు, కోతులతో పాటుగా మరో కొత్త జంతువు అడవి బర్రె, శాఖాహార జంతువులు, పాములు, పక్షులు ఉన్నాయి. అడవిని ఆనుకొని ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంతం నల్లమలకు ప్రత్యేక ఆకర్షణ. నేడు పులుల అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

2,166.37 చదరపు కిలోమీటర్లలో..

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ 2,166.37 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. 2022లో చేపట్టిన గణన ప్రకారం ఈ అడవిలో 33 పెద్ద పులులు(9 పులి పిల్లలు కలిపి), 170 చిరుత పులులు ఉన్నట్లు జాతీయ పులుల సంరక్షణ సంస్థ(ఎన్‌టీసీఏ) ప్రకటించింది. కోర్ ఏరియాలో మానవులు, పశువుల సంచారాన్ని నిషేధించగా, బఫర్ ఏరియాలో పశువులు మేపుకోవచ్చునని, ఇకో టూరిజం అభివృద్ధి చేసుకోవచ్చునని వైల్డ్ లైఫ్ నిబంధనలు విధించింది.

పెద్ద పులుల సంరక్షణకు కార్యక్రమాలు..

అమ్రాబాద్ అటవీ ప్రాంతంలోని పెద్ద పులుల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఇతోధికంగా నిధులు కేటాయిస్తోంది. నాగార్జున సాగర్, అమ్రాబాద్ పులుల అభయారణ్య పరిధిలోని 14 అటవీ రేంజ్‌ల పరిధిలో బేస్ క్యాంపుల ద్వారా అటవీశాఖ పెద్ద పులుల సంరక్షణకు శ్రీకారం చుడుతోంది. అడవుల్లో శాకాహార జంతువులను పెంచడంతో పాటు గడ్డి క్షేత్రాలను అభివృద్ధి చేస్తోంది. వేసవిలో మూడు నెలల పాటుగా అగ్నిప్రమాదాల నియంత్రణకు స్థానిక యువ చెంచు ఫైర్ వాచర్లను నియమిస్తోంది. అడవుల్లోని అన్ని బీట్లలో రేంజ్, సెక్షన్, బీట్ అధికారులను నియమించింది. వీరికి సహకారంగా ఉండేందుకు స్థానిక చెంచు యువకులను, ఇతర స్థానిక యువకులకు టైగర్ ప్రొటెక్షన్ వాచర్లుగా నిమించింది. వారందరికీ నెల నెలా వేతనాలు ఇస్తూ స్థానికులకు ఉపాధి కల్పిస్తోంది. నీటి వనరులు ఉన్న చోట చెక్ డ్యామ్‌లు, ఊట కుంటలు నిర్మిస్తుండగా, నీటి వనరులు లేని చోట సాసర్ పిట్లలో సౌరశక్తి మోటార్ల ద్వారా తాగునీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఎఫ్‌డీవో, డీఎఫ్‌వో, ఎఫ్‌డీలు పులుల సంరక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అడవిలోకి వెళ్లకుండా పకడ్బందీ చర్యలు

అడవిలో చీపురు పుల్ల తేవాలన్నా అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సిందే. ప్రతీ రేంజ్‌లోనూ, బండ్ల బాటల్లోనూ గేట్లను ఏర్పాటు చేసి ఇతరుల సంచారం లేకుండా చేశారు. శ్రీశైలం హైదరాబాద్ రహదారి వెంట ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయడం వల్ల వాటిని తిని వన్యప్రాణులు అనారోగ్యానికి గురవుతున్నట్లు గుర్తించిన అటవీ అధికారులు ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. మన్ననూరు నుంచి దోమలపెంట వరకు లీటర్ లోపల ఉన్న ప్లాస్టిక్ నీటి సీసాలను ఈ నెల ఒకటి నుంచి పూర్తిగా నిషేధించారు.



జంతువులను ఫొటోలు తీసేందుకు అడవిలో చెట్టుకు సీసీ కెమెరాను బిగిస్తున్న అటవీ సిబ్బంది

పులుల కదలికలపై ప్రత్యేక నిఘా

నల్లమలలో పులుల సంచారంపై అటవీ శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. గతంలో పాద ముద్రల ఆధారంగానే పులుల సంఖ్యను లెక్కించేవారు. ప్రస్తుతం అత్యాధునిక సాంకేతికతను కల్గిన సీసీ ట్రాఫ్ కెమెరాలను అడవిలో చెట్లకు బిగించారు. అవి ఏదైన అటవీ జంతువు సంచరిస్తే.. ఆటోమెటిక్ ఫ్లాష్ ద్వారా ఫొటోను తీస్తాయి. ఆ వివరాలను సిబ్బంది ఎప్పటికప్పుడు ఎన్‌టీసీకి పంపిస్తారు. ఆయా బీట్లలో పనిచేసే బీట్ అధికారులు పులి పాదముద్రలు, వాటి పేడ, చెట్లకు వాటి వెంట్రుకలు కనిపించినా టైగర్ మూవ్ మెంట్ ఫాంలో వివరాలు రాసి, స్థానిక రేంజ్ కార్యాలయంలో సమర్పిస్తారు. ప్రతీ సాసర్ బిట్ వద్ద వన్యప్రాణులకు ఉప్పు బిస్కెట్లను అందుబాటులో ఉంచుతారు.

పునరావాస ప్యాకేజీల అమలు

నల్లమలలో ఎలాంటి వసతులు లేకుండా ఇబ్బంది పడుతున్న వారిని పునరావాస ప్యాకేజీ కల్పించి, వారందరినీ మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అటవీ శాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సార్లపల్లి గ్రామంలోని 200 కుటుంబాలకు కొల్లాపూర్ సమీపంలోని బాకారం సామాజిక అటవీ ప్రాంతంలో భూములు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. వటవర్లపల్లి గ్రామంలోనూ గ్రామ సభ నిర్వహించి, వారికీ పునరావస ప్యాకేజీ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామాలు ఖాళీ అయిన ప్రాంతంలో ప్లాంటేషన్లను అభివృద్ధి చేసి పులులకు అనువైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. పెద్ద పులులకు ఆహార వనరులైన శాఖాహార జంతువులను వృద్ధి చేసేందుకు అటవీ శాఖ దృష్టి పెట్టింది. అందుకోసం ఏటా చర్యలు చేపడుతోంది. జూన్‌లో వాటిపై సర్వే కూడా చేపట్టారు. ఇలాంటి చర్యలను మరింత కట్టుదిట్టంగా కొనసాగిస్తే రాబోయే రోజుల్లో అమ్రాబాద్ అడవుల్లో పెద్ద పులుల సంఖ్య మరింత పెంచొచ్చనని అటవీ శాఖ యోచిస్తోంది.

వైద్యుడి నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

- సెల్‌ఫోన్ మెసేజ్ ద్వారా నర్సుల చికిత్స
- మృతదేహంతో బంధువుల ఆందోళన



పోలీసులతో వాగ్వివాదానికి దిగిన మృతురాలి బంధువులు

పెబ్బేరు, జూలై 28: వాంతులు, కడుపు నొప్పితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణీ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్ద దగడ గ్రామానికి చెందిన సరిత (పుష్పావతి) (22) అనే గర్భిణికి శనివారం రాత్రి వాంతులు, కడుపు నొప్పి రావడంతో పెబ్బేరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకవచ్చారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులు వైద్యుడికి సమాచారం ఇచ్చారు. ఆయన సెల్‌ఫోన్ మెసేజ్ ద్వారా ఫలానా ఇంజక్షన్లు వేయాలని నర్సులకు సూచించడంతో వారు గర్భిణికి వేశారు. దీనితో నర్సులు చేసిన వైద్యం వికటించి ఆదివారం తెల్లవారు జామున మృతి చెందగా, పరిస్థితి విషమించిందని డ్యూటీ డాక్టర్‌కు నర్సులు చెప్పగా అప్పుడు ఆయన ఆస్పత్రికి వచ్చి ఆమెను పరిశీలించి పరిస్థితి విషమించిందని కర్నూలుకు వెళ్లాలని సూచించారు. కర్నూలుకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని అక్కడి వైద్యులు తెలిపారని బంధువులు తెలిపారు. మృతురాలు శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లి గ్రామానికి చెందిన మహిళ కాగా ఆమెను చిన్నంబావి మండలం పెద్ద దగడ గ్రామానికి చెందిన ఎల్లస్వామి అనే వ్యక్తికి గత ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగినట్లు బంధువులు తెలిపారు. కాగా ఆమె ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణిగా ఉందని, అందులో భాగంగానే చికిత్స కోసం రాగా ఇలా జరిగిందని మృతురాలి బంధువులు బోరున విలపించారు. మృతురాలి తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో తల్లి ఆమెను పెంచి పెళ్లి చేసిందని బంధువులు గుర్తు చేశారు. వైద్యం వికటించి గర్భిణి మరణించిన విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెబ్బేరుకు చేరుకొని ఆసుపత్రి యజమాన్యంపై చర్యలు తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శవాన్ని కర్నూలు నుంచి తీసుకొచ్చి ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తారని తెలుసుకున్న కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డిలు ఆసుపత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి వరకు మృతురాలి పరిహారం ఇప్పించేందుకు గ్రామస్థులు, నాయకులు ప్రయత్నాలు చేశారు. పోలీస్ స్టేషన్ సమీపంలో ఆసుపత్రి యజమాన్యంతో గ్రామస్థులు చర్చలు జరిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

జడ్చర్ల, జూలై 28: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి శివారులో పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసినట్లు జడ్చర్ల టౌన్ సీఐ ఆదిరెడ్డి ఆదివారం రాత్రి తెలిపారు. పేకాట స్థావరం వద్ద రూ. రెండు వేల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో నాలుగురు తప్పించుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నాట్లు సీఐ తెలిపారు.









ద్విచక్రవాహనం, లారీ ఢీకొని వ్యక్తి మృతి

మక్తల్, జూలై 28 : ద్విచక్రవాహనం, లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ సమీపంలోని దండు మలుపు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి కథనం మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఊట్కూర్ మండల కేంద్రానికి చెందిన రమేష్(47) పట్టణంలో నివసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందు సోడా బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. తన అత్తవారి ఊరు అయిన పాతర్‌చెడ్ వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రాయచూరు వైపు వెళుతున్న ఓ లారీ దండు మలువు వద్ద ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో రమేష్ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు హుటాహుటిన మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రమేష్ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. భర్త మృతితో భార్య జయమ్మ బోరున విలపిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడికి 13ఏళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు పట్టణవాసులు కోరారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, జూలై 28: రైలుకింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం పోల్కంపల్లికి చెందిన బైకని చెన్నయ్య(40) శనివారం రాత్రి బోయపల్లిగేట్ సమీపంలోని రైలుపట్టాలపై రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వ్యక్తిగత సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం జనరల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.







వర్షాలతో పంటలకు జీవం

- ఊకచెట్టువాగులోకి చేరుతున్న నీరు

- నిండుకుండలా ఏదులాపూర్ చెక్‌డ్యాం

చిన్నచింతకుంట, జూలై 28 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరినిస్తున్నాయి. వర్షం కురుస్తుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. మండలంలోని బండర్‌పల్లి, కౌకుంట్ల మండలం దాసర్‌పల్లి, అప్పంపల్లి, ముచ్చింతల, తిర్మలాపూర్, చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి, గూడూరు, ఉంద్యాల, లాల్‌కోట, పల్లమర్రి, ఏదులాపూర్, దమగ్నాపూర్, నెల్లికొండి, సీతారాంపేట తదితర గ్రామాల శివారులో రైతులు వరి, పత్తి, చెరుకు, కంది వంటి పంటలను సాగు చేశారు. రైతులు వరి నారుమడులను సిద్ధం చేసుకున్నారు. కొన్ని చోట్ల వరి నాట్లు వేశారు. ఇంకా చాలా వరకు వరినాట్లు వేసేందుకు రైతులు తమ పొలాల్లో కరిగెట పనులు పూర్తి చేసుకున్నారు. ముసురు వర్షంలోనూ కూలీలతో నాట్లు వేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అలాగే పత్తిని రైతులు రికార్డు స్థాయిలో వేశారు. లాల్‌కోట, పల్లమర్రి, ఉంద్యాల, దమగ్నాపూర్, దాసర్‌పల్లి ప్రాంతాల్లో పత్తిని అత్యధికంగా సాగు చేశారు. ప్రస్తుతం ముసురు వర్షాలు పంటలకు ఊపిరినివ్వటంతో రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరుకు రైతులకు వర్షాలు మేలు చేకూరుస్తున్నాయి.


ఆశాజనకంగా ఉన్న పత్తిపైరు


ఏదులాపూర్‌లో వరినాటు వేస్తున్న కూలీలు

చెక్‌డ్యాం వల్ల పెరిగిన భూగర్భ జలాలు

మండలంలోని బండర్‌పల్లి, ఏదులాపూర్ గ్రామాల శివారుల్లోని చెక్‌డ్యాంలకు నీరు చేరటంతో వాగు శివారు ప్రాంతాల వ్యవసాయబోర్లలో నీటిమట్టం పెరిగింది. దాంతో భూగర్భజలాలు కూడా వర్షం కారణంగా పెరగటంతో ఇక భూగర్భజలాలకు ఇక ఏ ఢోకా లేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా పండ్లతోటలైన మామిడి, జామ, బత్తాయి తదితర పండ్ల తోటలకు వర్షాలు ఊపిరినిచ్చినట్లైంది.

పంటలకు మేలు జరిగింది



ముసురువర్షాలకు పంటలకు కొంతవరకు మేలు జరిగింది. అంతకు మందు వానజాడలేక మొక్కలు ఎండుముఖం పట్టిన సమయంలో వర్షం ఊపిరినిచ్చింది. పత్తి, కంది, వరితో పాటుగా పండ్ల తోటలకు మేలు జరుగుతున్నది.

- కొండారెడ్డి రైతు, ఏదులాపూర్

40 ఎకరాల్లో పత్తిపంటను సాగు చేశా



నేను నా 18 ఎకరాలతోపాటు మరో 22 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తిని సాగు చేశాను. ఈ వానలు పత్తిమొక్కలకు మేలు చేశాయి. ముసురు వర్షం ఇంకా కొన్ని రోజులు కురిస్తే, పంటలు దెబ్బ తింటాయి. కొంత వరకు మేలు కలిగింది.

- గంటా శ్రీనివాసులు, రైతు, ఏదులాపూర్





సహాయ, సేవా కార్యక్రమాల్లో ముందుండాలి


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కందనూలు జూలై28: తోటి స్నేహితులకు ఆపదలో ఉన్నప్పుడు సహాయసహకారాలు అందించడంతో పాటు విద్యనభ్యసించిన కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని 1992-94సంవత్సరంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించిన విద్యార్థులు ఆకాంక్షించారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న సుమారు 50మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడడానికి ఉద్యోగాలలో విధులు నిర్వహించడానికి కళాశాల విద్య ఎంతో దోహదం చేసిందని కొనియాడారు.

చిన్నారుల భవితకు బాటలు

- ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌లతో బాల కార్మికులకు భరోసా

- ప్రతీ ఏటా జనవరి , జూలైలో అధికారుల తనిఖీలు

- ఇప్పటి వరకు 719 మందికి విముక్తి

వనపర్తి క్రైం, జూలై28: బాల కార్మికులను వెట్టి చాకిరి నుంచి విముక్తులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ యేటా ఆపరేషన్ ముస్కాన్‌ను ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. వివిధ కారణాలతో చదువు మానేసి బాల కార్మికులుగా మారిన పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తుంది. బాలలు బడిలో గడపాలని పనిలో కాదని ఈ కార్యక్రమం ద్వారా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పేద కుటుంబాలలోని పిల్లలు హోటళ్లు, కిరాణం దుకాణాలు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులతో పాటు వివిధ పనులు చేస్తున్న వారిని గుర్తించి వెట్టిచాకిరి నుంచి కాపాడి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం 2014 నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని ప్రతీ యేటా జనవరి 1నుంచి 31వరకు ఆపరేషన్ స్మైల్, జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు చేపడుతుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను అధికారులు జిల్లాలో ముమ్మరంగా చేపడుతున్నారు. బాలబాలికలను గుర్తిస్తు వారితో పని చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. 18 ఏళ్లలోపు పిల్లలు చదువు మానేసి కార్మికులుగా మారిన వారి వివరాలు సేకరించి అదుపులోకి తీసుకుంటున్నారు. అదుపులోకి తీసుకున్న బాలకార్మికుల పరిస్థితులను బట్టి వారికి అందుబాటులో ఉండి పాఠశాలల్లో అడ్మిషన్లు ఇప్పించి చదువు చెప్పిస్తున్నారు. అనాథలైతే చైల్డ్ కేర్ హోంలో చేర్పి ఆలనా పాలన చూస్తున్నారు.

2017 నుంచి 719 మందికి విముక్తి

ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని 2014 లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. వనపర్తి జిల్లా ఏర్పాటైన తరువాత 2017 నుంచి 2024 వరకు ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా 439 మందికి, జూలైలో చేపట్టే ముస్కాన్‌లో భాగంగా 280 మంది బాలబాలికలకు విముక్తి కలిగించారు. బాలల రక్షణ కమిటీల ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు. గుర్తించిన బాల కార్మికులను తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. బడికి పంపించే పిల్లల తల్లిదండ్రులతో అంగీకార పత్రాలను కూడా రాయించుకుంటున్నారు.

పనిలో పెట్టుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

18 ఏళ్లలోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తాం. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ప్రత్యేకంగా తనిఖీలు చేపడుతున్నాం. బాలలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం, 2017 నుంచి 24 వరకు 719 మంది బాలబాలికలకు విముక్తి కలిగించాం. ఎవరైనా బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే 1098లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

- ఎస్ఐ అంజద్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌చార్జి



సింగోటం ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకున్న శశాంక్‌గోయల్

కొల్లాపూర్, జూలై 28 : కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ తెలంగాణ చీఫ్ సెక్రటరీ శశాంక్‌గోయల్ శశాంక్ గోయల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ఆయనను ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. పురాతన ప్రాచీన మహిమ గల ఆలయాన్ని సందర్శించడం తనకెంతో సంతృప్తినిచ్చిందని చీఫ్ సెక్రటరీ శశాంక్‌గోయల్ పేర్కొన్నారు.

పీసీసీ ఇంటర్నేషనల్ అఫైర్స్ కో ఆర్డినేటర్‌గా నంగి దేవేందర్‌రెడ్డి


నంగి దేవేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 28: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, ప్రవాస భారతీయుల విభాగంలో అంతర్జాతీయ వ్యవహారాల సమన్వయకర్తగా ఎన్‌ఆర్‌ఐ నంగి దేవేందర్‌రెడ్డి నియమితులయ్యారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ఛైర్మన్, అంబాసిడర్ డాక్టర్ బీఎం వినోద్‌కుమార్ ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఐక్యరాజ్య సమితిలో 193 సభ్య దేశాలకు ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్యకోసం తెలంగాణవాసులు వలస వెళ్లారని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాసులను అనుసంధానం చేయడానికి కాంగ్రెస్ పార్టీ తరఫున కృషి చేస్తానని నంగి దేవేందర్‌రెడ్డి తెలిపారు. తన నియామకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తూ వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

రేవల్లి,జూలై28: వనపర్తి జిల్లా రేవల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయింది. ఆదివారం ఉదయం డీఎస్పీ వెంకటేశ్వరరావు రేవల్లి మండల కేంద్రంలో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన గట్టు వెంకటమ్మకు 520 సర్వే నంబర్‌లో రెండు గుంటల పొలం ఉన్నది. ఈ పొలం పక్కనే లోడే బీరయ్య ఇంటి బాట కావాలని పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకున్నారు. శనివారం వెంకటమ్మను లోడే పర్వతాలు, బీరయ్య, చిన్నమ్మ, రేణుక నలుగురు కలిసి కులం పేరుతో తిడుతూ ఆమెపై దాడి చేశారు. బాధితురాలు వెంకటమ్మ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఇదే విషయంపై మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మాల కేశవులు ఓ దళితురాలు వెంకటమ్మపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. వెంకటమ్మను కులం పేరుతో తిట్టి దాడికి పాల్పడిన పర్వతాలు, బీరయ్య, చిన్నమ్మ, రేణుకలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి శిక్షించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దళితులపై ఎన్ని దాడులు జరుగుతున్న న్యాయం జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు,జూలై 28: వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బొసింగ్ తండా పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బొసింగ్‌తండాకు చెందిన లక్ష్మీదాస్ (36) నాయక్ భీమా నాయక్‌లు ఇద్దరు చందు నాయక్ పొలంలో అంచులు తీయడానికి వెళ్లారు. లక్ష్మీదాస్ నాయక్ దాహంగా ఉందని చందు నాయక్ పొలంలో ఉన్న వ్యవసాయ బావిలోకి నీళ్లు తాగడానికి వెళ్లాడు. నీళ్లు తాగే సమయంలో కాలు జారి బావిలో పడి మునిగిపోతూ కేకలు వేశాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న చందు నాయక్ వెళ్లి లక్ష్మీదాస్ నాయక్‌ను బయటకు తీయగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉంటున్న లక్ష్మీదాస్ భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం ఉదయం ఆమె చేరుకుని బోరున విలపించింది. కాగా మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవాబ్‌పేట, జూలై 28: కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని రేవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని రేవల్లికి చెందిన చీపుర్ల సువర్ణ (36) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ నెల 27న అర్ధరాత్రి కడుపు నొప్పి రావడంతో పురుగుల మందు తాగింది. గమనించిన తల్లి నీలమ్మ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందింది. తమ్ముడు నరేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మైనర్‌తో వివాహం.. కేసు నమోదు

మిడ్జిల్, జూలై 28: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి మైనర్‌ను వివాహం చేసుకున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు ఆదివారం తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

గోవులను పూజిస్తే పుణ్యం


దేవుని తిర్మలాపూర్‌లో గోమయం ఉత్పత్తుల తయారీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న గోశాల నిర్వాహకులు

పెద్దకొత్తపల్లి, జూలై 28: సమాజంలో ప్రతీ ఒక్కరు గోవులను పూజిస్తే పుణ్యం కలుగుతుందని గోశాల నిర్వాహకులు వి.సత్యం, లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేవుని తిర్మలాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోశాల సంరక్షణ, గోమయం ఉత్పత్తుల తయారీపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశీ ఆవుల సంరక్షణ, గోమయం నుంచి ప్ర కృతి వ్యవసాయం చేయడానికి రైతులకు గోవులు ఎంతగానో ఉపయోగపడుతాయని.. వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. మన దేశీ ఆవుల ను సంరక్షించడం కోసం గోమయం ఉత్పత్తుల త యారీ చేసే విధానం గురించి వారు క్షుణ్ణంగా వివరించారు. అంతకు ముందు గోశాలలో సామూహిక గోపూజా కార్యక్రమం నిర్వహించారు. గోమయంతో టూత్‌పౌడర్, దూప్ స్టిక్, గణేష్ విగ్రహాలు, జీవామృతం, ద్రవ జీవామృతం వంటి పలు ఉత్ప త్తులు తయారు చేసే విధానం గురించి గ్రామ స్థులకు ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. గ్రామ మాజీ సర్పంచ్ సత్యం, కుటుంబ సభ్యులతో పాటు నిర్వాహకులు లక్ష్మీనారాయణరాజు, లక్ష్మణ్ దాస్, పూరి రాజేష్, అర్చకులు శేషాచార్యులు, శేఖర శర్మ పాల్గొన్నారు.

వసతి 'గ్రహా'లు!

- శిథిల భవనాల్లో హాస్టళ్ల నిర్వహణ
- చలికి వణుకుతూ.. వానకు తడుస్తూ విద్యార్థుల అవస్థ
- అస్తవ్యస్తంగా టాయిలెట్స్..
- సంఖ్యకు తగ్గ సౌకర్యాల కల్పనలో విఫలం


అద్దె భవనంలో కొనసాగుతున్న అలంపూర్ పోస్ట్‌మ్యాట్రిక్ హాస్టల్

అలంపూర్ చౌరస్తా, జూలై 28: పేద విద్యార్థులు చదువుకునే వసతి గృహాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతోంది. శిథిల భవనాల్లో ప్రమాదకర చదువులు కొనసాగుతున్నా పట్టించుకోనే వారు లేరు. వ్యక్తిగత మరుగుదొడ్లపై విస్తృత ప్రచారం చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులు ఆరుబయటికి వెళ్తున్నా చర్యలు తీసుకోకపోవడం దారుణం పేరుకే వసతిగృహాలు వసతుల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే పాలకులు లేకపోవడం శోచనీయం. చివరకు కాస్మోటిక్ చార్జీలు కూడా ఇవ్వడం లేదంటే పేదవిద్యార్థుల చదువులపై ఏమాత్రం ఆసక్తి ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు 17, బీసీ సంక్షేమ వసతి గృహాలు 12 ఉన్నాయి. గద్వాల బీసీ బాయ్స్ హాస్టల్‌లో 230మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా 327 మంది విద్యార్థులు కేవలం ఎనిమిది గదులల్లో సర్దుకుంటున్నారు. వసతులు, గదుల కొరత కారణంగా ఇంకా 130మంది విద్యార్థులకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. ఇంతమంది విద్యార్థులున్న ఈ భవనానికి నేటికి మిషన్ భగీరథ కనెక్షన్ లేదు. ఉన్న రెండు బోర్లలో ఒకటే పని చేస్తోంది. ఇటీవల ఆర్వోప్లాంటు ఇన్‌స్టాల్ చేసిన విద్యార్థులకు సరిపడ నీటిని అందించలేకపోతోంది. భవనంలో టాయిలెట్స్ సరిపోవడం లేదని మరో 20 బాత్రూంలతో పాటు అదనపు గదులు అవసరమని అక్కడ ఉండే అధికారులు అంటున్నారు.

● గద్వాల పట్టణంలోని నల్లకుంట ఎస్సీ సంక్షేమ బాలికల వసతి గృహంలో బాలికల బాధలు వర్ణనాతీతం. వందమంది ఉండాల్సిన ఈ భవనంలో 293 మంది ఉంటున్నారు. పిల్లలు ఉండటానికి 14గదులున్నాయి. గదికి పదిమంది నిద్రించాల్సిన చోట 20మంది నిద్రిస్తున్నారు. పిల్లలందరికీ కలిపి కేవలం ఆరు మరుగుదొడ్లు, ఏడుస్నానపుగదులు మాత్రమే ఉన్నాయి. ఉదయం కాలకృత్యాలకు క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. చదువుతో పోరాడాల్సిన పిల్లలు సమస్యలతో పోరాడుతున్నారు.

● అలంపూర్ మండల కేంద్రంలో పోస్ట్‌మ్యాట్రిక్ బాలికల, మగపిల్లల హాస్టల్స్ రెండూ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 2012లో ప్రారంభమైన ఈ వసతి గృహాలు మొదటి నుండి అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దెభవనం కావడంతో చదుదుకోవాలంటే విద్యార్థులు జంకుతున్నారు. బాయ్స్ హాస్టల్‌లో కేవలం ఎనిమిది మందే ఉన్నారు. వీరికి ఒక్క బాత్రూం కూడా సరిగా లేకపోవడంతో కాలకృత్యాలకు ఆరుబయటకు వెళ్తున్నారు. వరండాలోనే స్నానమచారిస్తున్నారు. బాలికల హాస్టల్ శిథిలావస్థలో ఉన్నది. ఇందులో 20మంది విద్యార్థులుంటారు. అరకొరవసతులతో కాలం వెల్లదీస్తున్నారు.

● ఉండవల్లి ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో 3నుంచి 10వ తరగతి వరకు 121మంది విద్యార్థులు ఉన్నారు ప్రభుత్వ భవనం శిథిలమై, పెచ్చులూడటం, కిటికీలు, గోడలు కూలిపోతుండటంతో గ్రామపెద్దల సహకారంతో పిల్లలను అద్దెభవనంలోకి తరలించారు. సదరు అద్దెభవనంలో పిల్లలందరికీ కలిపి నాలుగు గదులు, మూడు బాత్రూంలు మాత్రమే ఉన్నాయి.


● రాజోలి ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో 44మంది విద్యార్థులున్నారు. 2009లో వచ్చిన వరదలకు శిథిలమైంది. కొన్నేళ్లపాటు అద్దెభవనంలోనే నెట్టుకొచ్చారు. మూడేళ్లుగా పక్కనే నిర్మించిన డైనింగ్ హాల్‌లోకి పిల్లలను చేర్చారు. ఇక అప్పటి నుంచి ఒకే గదిలోనే వంట వార్పు, బియ్యం సంచులు, సరుకులు, వంటపాత్రలకే దాదాపు సరిపోయింది. ఇక మిగిలిన కొంతమేరలో పిల్లల పెట్టెలు పెట్టుకుని వాటిపైనే నిద్రిస్తూ కాలం వెల్లదీ స్తున్నారు.

● అయిజ బీసీ సంక్షేమవసతి గృహం 1997 నిర్మించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. మొత్తం 11 గదులున్న ఈ భవనాన్ని వంక పక్కన నిర్మించారు. 2009లో వరదల వల్ల నెలరోజులపాటు భవనం నీటిలోనే ఉండిపోవడంతో దెబ్బతింది. నాలుగు గదులు పూర్తిగా దెబ్బతినడంతో సీజ్‌చేశారు. ఉన్న ఏడింటిలో ఒకటి స్టోర్‌రూమ్‌కు పోను మిగిలిన ఆరుగదుల్లో మూడు గదులు వర్షానికి కురుస్తున్నాయి.

● శాంతినగర్ బీసీ సంక్షేమహాస్టల్ 1985 నుంచి కొనసాగుతుంది. నాటి నుంచి అద్దెభవనంలోనే కొనసాగుతుందంటే పాలకుల నిర్లక్ష్యం ఏపాటిదో ఇట్టే అర్థం అవుతుంది. 2018లోనే స్థలం గుర్తించి నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన నేటికి కార్యరూపం దాల్చలేదు. 40మంది ఉన్న విద్యార్థులకు కేవలం రెండు బాత్రూంలే ఉన్నాయి. కొంతమంది విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. పాలకులు స్పందించి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గద్వాల జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని సంక్షేమ హాస్టల్స్‌లో చదివే విద్యార్థులకు అందించే కాస్మోటిక్ చార్జీలు గత విద్యాసంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం ప్రారభమై నలభైరోజులు కావస్తున్నా నేటికీ దుప్పట్లు, దుస్తులు, సామగ్రిపెట్టెలు ఇవ్వలేదు. ప్రతీఏటా భవన నిర్వహణ కోసం రూ.ఐదు లక్షలు వచ్చేవి. కానీ ఈ నిధులు ఐదేళ్లగా రావడం లేదు. కనీసం బాత్రూం దార్వజాలు మరమ్మతులు చేయించలేని పరిస్థితి సంక్షేమ వసతి గృహాల్లో నెలకొంది. అధికారులు, పాలకులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.


దర్వాజలు లేని అలంపూర్ బీసీ హాస్టల్ బాత్రూంలు


వర్షాలకు కారుతున్న అలంపూర్ ఎస్సీ సంక్షేమ హాస్టల్ పైకప్పు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా



సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు ఉన్నమాట వాస్తవమే. సమస్యలన్నింటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం. త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం. పిల్లలను చేర్చుకోవాలని వస్తున్న విజ్ఞప్తులను కాదనలేక చాలా చోట్ల విద్యార్థుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా పరిమితికి మించి పిల్లలున్న చోట సమస్యలు మరింత తీవ్రం అవుతున్నాయి.

- శ్వేతప్రియదర్శిని, డీఎస్‌సీడీవో గద్వాల

కురుమూర్తి గుట్టపైకి ఘాట్‌రోడ్డు కోసం సర్వే

- మెట్లదారిలో వెళ్లలేని భక్తులకు ప్రయోజనం

చిన్నచింతకుంట, జూలై 28: కలియుగ ప్రత్యక్ష దైవం పేదల తిరుపతిగా పేరొందిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి గుట్టపైకి ఘాట్‌రోడ్డు కోసం కదిలిక మొదలైంది. తాజాగా రెండు రోజుల క్రితం దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి ఘాట్‌రోడ్డుపై ప్రత్యేక దృష్టితో సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులైన ఈఎన్‌సీ అధికారులు సీఈ మోహన్‌లాల్, ఎస్‌ఈ నర్సింగం, డీఈ నరేందర్, ఈఈ దేశానాయక్, ఏఈ రాములుతో కలిసి స్వామి వారు కొలువుదీరిన దేవరగట్టు వరక ఘాట్‌రోడ్డును నిర్మించేందుకు సర్వే నిర్వహించారు. అయితే ముందు భాగంలో ఒక కిలోమీటర్, వెనుకభాగంలో రెండు కిలోమీటర్ల ఘాట్‌రోడ్డు అవసరముందని అధికారులు అంచనా వేశారు. దీనికి సంబంధించిన ఎస్టిమేషన్‌ను తయారు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. కురుమూర్తిస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్కడ చాలా అవకాశాలున్నాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలిసింది.

ఘాట్‌రోడ్డుతో తీరనున్న భక్తుల అవస్థలు

కురుమూర్తి స్వామి వారి దర్శనం కోసం వెళ్లేందుకు భక్తులు చాలా దూర ప్రాంతాల నుంచి వస్తారు. అయితే తిరుమలలో స్వామి వారికి ఏడుకొండలు ఉన్నట్లే, కురుమూర్తి స్వామికి ఏడుకొండలున్నాయి. స్వామి వారు దేవరగట్టులోని కాంచనగుహలో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తులు దాదాపు 400 మెట్లను ఎక్కి స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే వయోవృద్ధులు, మోకాళ్లనొప్పులతో, వివిధ రకాల ఆరోగ్య సమస్యలున్న భక్తులు స్వామి వారి గుట్టకింది భాగంలోని రాజగోపురం వద్దే దండం పెట్టి, వెనుదిరుగుతారు. ఘాట్‌రోడ్డు పూర్తయి, అందుబాటులోకి వస్తే, అన్ని వర్గాల భక్తులకు అత్యంత సులువుగా స్వామి వారి దర్శనం లభిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే భక్తుల కల సాకారం కావాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


కురుమూర్తిగుట్టమీద సర్వే అధికారులతో మాట్లాడుతున్న స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్మికుడి మృతి


రాములు

దామరగిద్ద, జూలై 28: రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని ఆశన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆశన్‌పల్లికి చెందిన ఎరుకలి రాములు(51) తన ద్విచక్రవాహనంపై లోకూర్తికి వెళ్తుండగా యానగుంది నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గ్రామ సమీపంలో ఢీకొన్నడంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య మాణిక్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. కాగా, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ మండల నాయకుడు జోషి డిమాండ్ చేశారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి దుర్మరణం

దేవరకద్ర, జూలై 28: చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలోని ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. డోకూరుకు చెందిన రాఘవేందర్(16) అనే యువకుడు శనివారం సాయంత్రం ఇంటి నుంచి దేవరకద్ర బ్రిడ్జి దగ్గర ఉన్న వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ఫిట్స్ రావడంతో వాగులో పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు వాగులోంచి మృతదేహాన్ని బయటకు తీసి యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యువకుడి తల్లి అంజమ్మ, తండ్రి కురుమన్నల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

ముగిసిన అక్షిత్ రెడ్డి అంత్యక్రియలు

- గతవారం చికాగోలో మిత్రులతో కలిసి సముద్రంలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి
- రాంచంద్రాపూర్‌లో విషాదఛాయలు



అక్షిత్‌రెడ్డి(ఫైల్)

అడ్డాకుల, జూలై 28: స్నేహితులతో కలిసి ఆటవిడుపుగా సముద్రంలో ఈత కొట్టి సరదాగా గడపాలనుకున్న ఆ ఎంఎస్ విద్యార్థి నీట మునిగి దుర్మరణం చెందాడు. దేశంకాని దేశంలో చిన్న వయస్సులో మృత్యువాత పడి తల్లిదండ్రులకు పుత్రశోకం మిగి ల్చిన సంఘటనా ఈ నెల 21న యూఎస్-చికాగోలో చోటు చేసుకోవడంతో రాంచంద్రాపూర్‌లో విషాదం నింపింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచు కృష్ణారెడ్డి సోదరుడు, రాజగోపాల్‌రెడ్డి, సువర్ణ దంపతులు 15 సం వత్సరాల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడ్డారు. వీరి రెండవ కుమా రుడు అక్షిత్‌రెడ్డి ఎంఎస్ చేసేందుకు మూడు సంవత్సరాల క్రితం యూఎస్‌కు వెళ్లాడు. ఎంఎస్ పూర్తి కాగా ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. చికాగోలో ఈనెల 21న మిత్రులతో కలిసి సరదా గడిపేందుకు సముద్రానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి మృతి చెందాడు. ఆదివారం మృతదేహం స్వదేశానికి రాగా, రాంచంద్రాపూర్‌కు తీసుకవచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, రాజగోపాల్ రెడ్డి మొదటి కుమారుడు కూడా చిన్నవయస్సులో రాంచంద్రాపూర్ (కొత్తపల్లి)లో బావిలో పడి చనిపోవడం, ఇప్పుడు ఈ బాబు కూడా యాదృచ్ఛికంగా సముద్రంలో పడి చనిపోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నది. అడ్డాకుల జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రంగన్నగౌడ్, రైతుబంధు మాజీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మాజీ కోఆప్షన్ ఖాజాషౌరి, బొడ్డురమేశ్, మహేశ్ యాదవ్, డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి తదితర స్థానిక నాయకులు మృతదేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పార్కింగ్ లేక అవస్థలు

- పర్యాటకులతో కిక్కిరిసిన జూరాల ప్రాజెక్టు
- నిలువ నీడ, తాగునీటి వసతి లేక తీవ్ర ఇబ్బందులు


జూరాల ప్రాజెక్టుపై కిక్కిరిసిన పర్యాటకులు

అమరచింత, జూలై 28: పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా ప్రియదర్శిని జూరాల ప్రా జెక్టుపై పర్యాటకులకు ఏమాత్రం వసతులు అ ధికారులు కల్పించ లేదని చెప్పవచ్చు. ఎగువన ఉన్న నారాయణపూర్ నుంచి భారీగా మూడు లక్షల పది వేల ఇన్ ఫ్లో వరద జూరాల ప్రాజె క్టుకు చేరుతూ ఉండడంతో ప్రాజెక్టు అధికారులు 41 గేట్‌లను తెరిచి 2,98,411 క్యూసెక్కుల నీటిని దిగువకు వదు లుతున్నారు. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అయా ప్రాంతాలనే కాకుండా పక్కన ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు జూరాల ప్రాజెక్టు సందర్శించడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకుల తాకిడి మరింత పెరిగింది. ముఖ్యంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా పర్యాటకులు వాహనాలు తీసుకురావ డంతో పార్కింగ్ వ్యవస్థ కనబడకపోవడంతో పర్యాటకులు డ్యాం ప్రధాన రహదారిపైనే కిలో మీటర్ల మేర నిలిపి ఉండాల్సిన పరిస్థితి ఏర్ప డింది. అమరచింత ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను అదుపు చేయాలని ప్రయ త్నించినా పర్యాటకులు రెట్టింపు సంఖ్యలో రావడంతో ట్రాఫిక్ కంట్రోల్ కాలేదు. నిలువ నీడ లేకపోవ డం, కనీసం తాగడానికి నీటి సౌక ర్యం లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పాలకులు జూ రాల ప్రాజెక్టును పర్యాటక కేంద్రంలో అభివృద్ధి చేసి, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తామ ని హామీలు ఇవ్వడం తప్ప అక్కడ ఏ మాత్రం ఏర్పాట్లు చేయలేకపోవడం ఎంత వరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొందరు యువకుల అత్యుత్సాహం

ధరూరు : మండల పరిధిలోని రేవులపల్లి వద్ద ఉన్న జూరాల ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి పెరిగింది. పలువురు కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. కృష్ణమ్మ పరవళ్లను తిలకిస్తూ, ఫొటోలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు. కొందరు యువకులు బ్రిడ్జిపై సెల్ఫీలు దిగుతుండగా, మరి కొందరు అత్యుత్సాహంతో ప్రాజెక్టు దిగువన నీటి ప్రవాహం వద్ద సెల్ఫీలు దిగుతూ, చేపలను పడుతూ కనిపించారు. గతంలో ఇలా నీటి సమీపానికి వెళ్లి ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు వద్ద అధికారుల పర్యవేక్షణ పెంచాలని, పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

83, 84జిడిఎల్28 - జూరాల ప్రాజెక్టు 41 గేట్ల ద్వారా దిగువకు శ్రీశైలం వైపు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

నాలుగు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి 3 లక్షల క్యూసెక్కుల మేర వరద వస్తుండటంతో 41 గేట్లు ఎత్తి శ్రీశైలం జలాశయానికి నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పాదన కోసం జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి 18,932 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా, నాలుగు యూనిట్ల ద్వారా 143 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్-1కు 1300, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 315, ఎడమ కాల్వకు 820, కుడి కాలువకు 578, సమాంతర కాల్వకు 600, భీమా లిఫ్ట్-2కు 750, మొత్తం 2,98,882 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.


జూరాల ప్రాజెక్టు వద్ద ఫొటోలు దిగుతున్న పర్యాటకులు


ప్రధాన ఎడమ కాలువ వద్ద చేపల రుచి చూడడానికి బారులు తీరిన పర్యాటకులు


జూరాల ప్రాజెక్టు కింద భాగం నీటి ప్రవాహం వద్ద సెల్ఫీలు దిగుతున్న యువకులు

కార్గిల్ యుద్ధ వీరులకు సెల్యూట్

- 25వ కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం



విజయోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్మన్ మాజీ సైనికులు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 28 : కార్గిల్ యుద్ధ వీరులను స్మరించుకోవడం ఎంతైనా అవసరమని, వీరులకు సెల్యూట్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కార్గిల్ యుద్ధం జరిగి, అందులో మన ఆర్మీ విజయం సాధించి 25వ సంవత్సరాలు అవుతున్నందున విజయ్‌దివాస్ పేరిట వేడుకలు ఆదివారం జిల్లా ఉమ్మడి మాజీ సైనికులు పసుల కిష్టారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు సైనికులు ఆనాటి స్మృతులు నెమరు వేసుకున్నారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సైనికులు కార్గిల్ విజయ్‌దివస్ వేడుకలలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అందరు మాజీ సైనికులను కలుసుకున్నందుకు ఆనందంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ మహమూద్ పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సంఘం ప్రెసి డెంట్ వి. వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, గౌరవ అధ్యక్షుడు ఎంఆర్‌కె.రెడ్డి, అడ్వయిజర్ కె. వెంకటయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు ఎన్. రాములు, కోశాధికారి రాజవర్ధన్‌రెడ్డి, నిరంజన్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, గిరిధర్‌రెడ్డి, గణేష్, జమీల్, మాజీ సైనికులు వారి కుటుంబాలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సమస్యలపైన ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు.

నాటిన ప్రతీ మొక్క బతకాలి : ఎమ్మెల్యే

మహబూబూబ్‌నగర్, జూలై 28 : నాటిన ప్రతీ మొక్కను సంరక్షించే బాధ్యతను ప్రతీ ఒక్కరు తీసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలన్నారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు అంకితభావంతో పని చేయాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని స్టేట్‌హోమ్‌లో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 55 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 35 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే స్టేట్‌హోమ్ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సత్యనారాయణ నాయకులు షబ్బీర్‌అలీ, తిరుమల వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ సమాజ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వెంకటేష్



హైదరాబాద్‌లో నియామకపు ఉత్తర్వులు అందుకుంటున్న వెంకటేష్

పాలమూరు/ మిడ్జిల్, జూలై 28 : బీసీ సమాజ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ పట్టణానికి చెందిన వై.వెంకటేష్ నియమించటం సంతోషంగా ఉందని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రిటైర్డ్ డీజీపీ పూర్ణచందర్‌రావు సమక్షంలో రాష్ట్ర అధ్యక్షుడు సంఘం సూర్యారావు చేతులమీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. బీసీ సమాజ్ ఉద్యోగ సంఘం తరఫున అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా బీసీ సమాజ్ ఎల్లప్పుడు వెన్నంటి ఉండి బాగోగులు చూస్తుందన్నారు. కార్యక్రమంలో జాంద్రసంఘం అధ్యక్షుడు మహేందర్, కుమ్మరి సంఘం అధ్యక్షుడు బుగ్గన్న, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు డీకె నాయీ, సవారి సత్యం, బీశేఖర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై రేపు మౌన దీక్ష

పాలమూరు, జూలై 28 : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న చలో ఇందిరాపార్క్‌కు తరలిరావాలని తెలంగాణ పెన్షనర్స్ జేఏసీ నాయకులు కే.సీ వెంకటేశ్వర్లు, ఎ.తిమ్మ ప్ప, కె.రామదాసు, ఎన్.కిష్ట య్య కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో నాయ కులు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేయాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం అందజేయాలన్నారు. నామమాత్రంగా ఇస్తున్న ఐఆర్‌ను 5శాతం నుంచి 20 శాతానికి పెంచి ఇవ్వాలని కోరారు. పీఆర్‌సీ రిపోర్టు తెప్పించుకుని అమలు చేయాలన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన వెల్‌నెస్ సెంటర్లు, హైదరాబాదులో పది నెలకొ ల్పాలన్నారు. పెన్షనర్స్ సమస్యలపై 30వ తేదీన పెద్ద ఎత్తున మౌనదీక్ష చేపడుతు న్నట్లు తెలిపారు. సమావేశంలో మజరుల్లా కొత్వాల్, యం.రాఘవరెడ్డి, పి.కొండయ్య పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



హన్వాడలో విద్యార్థులనుంచి సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

హన్వాడ/ మహమ్మదాబాద్, జూలై 28 : సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని సంక్షేమ హాస్టల్ యాత్ర జిల్లా అధ్యక్షుడు కురుమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హన్వాడలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు వెళ్లి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు లేవని, స్నానాలకు ఇబ్బంది ఉందని అన్నారు. మెనూ అమలు చేయడంలేదని, తాగు నీరు కలుషితంగా ఉన్నాయని ఆరోపించారు. విద్యార్థులకు సరిపడే గదులు లేవని, హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మాణిక్యంరాజు, నాయకుడు విష్ణు పాల్గొన్నారు.

● మహమ్మదాబాద్‌లోని బాలు వసతి గృహం, బాలికల వసతి గృహం, నంచర్లలోని బాలుర వసతి గృహాన్ని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లెల మాణిక్యం రాజు, కురుమయ్య పరిశీలించారు. విద్యార్థులు వసతి గృహాలలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని తెలిపారు. ఆది విష్ణు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి

- సెక్టోరియల్ అధికారులు బైకాని బాలు యాదవ్, దుంకుడు శ్రీనివాస్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సెక్టోరియల్ అధికారులు, గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నాయక్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 28 : ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి విద్యార్థులకు మెరుగైన విద్యనందించి మంచి ఫలితాలు తీసుకురావాలని సెక్టోరియల్ అధికారులు బైకాని బాలుయాదవ్, దుంకుడు శ్రీనివాస్ అన్నారు. జీహెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్స్. పీడీలు, పీఎస్ హెచ్‌ఎంలు పదోన్నతి పొందిన గిరిజన ఉపాధ్యాయులను గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఎడ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నాయక్ సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సెక్టోరియల్ అధికారులు మాట్లాడారు. పదోన్నతి పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వారికి బాధ్యత కూడా పెరిగిందన్నారు. గోవింద్‌నాయక్ మాట్లాడుతూ తండా పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. తండాలలో ఉన్న పిల్లలంతా చదువుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు థారసింగ్ ప్రధాన కార్యదర్శి హీరాలాల్, రిటైర్డ్ డీఈవో ఎస్.విజయ్‌కుమార్, ఎంఈవోలు వెంకటయ్య, రాజు నాయక్, హెచ్‌ఎంలు, గిరిజన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అంబా భవాని అమ్మవారికి పూజలు



మహబూబ్‌నగర్‌లో అంబా భవాని దేవాలయంలో బోనాల ఉత్సవాలలో పాల్గొన్న ప్రజలు



పంచముఖి కాలనీలోని బురుజు గడ్డ మైసమ్మ అమ్మవారికి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

ప్రజలపై తోటమైసమ్మ దీవెనలు ఉండాలి

- అమ్మవార్లకు పూజలు చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు



మహబూబ్‌నగర్‌లో తోటమైసమ్మ అమ్మవారి ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు



అలంకరణలో తోటమైసమ్మ విగ్రహం

పాలమూరు/ మహబూబ్‌నగర్ టౌన్, జూలై 28 : ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం నిర్వహించిన భవసార్ క్షత్రియ సమితి అంబాభవాని అమ్మవారి బోనాలు ఉత్సవంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్మాత అంబాభవాని ఆశీస్సులు పట్టణ ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. క్షత్రియ సంఘం వారు ఒక్కో కుటుంబం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఒక్కో విద్యార్థిని దత్తత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

● పంచముఖి కాలనీలో : జిల్లా కేంద్రంలోని పంచముఖి కాలనీలో వెలిసిని బురుజు గడ్డ మైసమ్మ అమ్మవారి ఆషాఢ మాసం బోనాల పర్వదినానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నరసింహారెడ్డి, బండి ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.

ప్రజలందరిపైన కుర్హిణిశెట్టి కాలనీలో వెలిసిన తోట మైసమ్మ దీవెనలు ఉండాలని తోటమైసమ్మ దేవాలయ కమిటీ పెద్దలు బుట్ట రామస్వామి, డా.భీమ్‌రాజ్, కనికె రామలింగం, కార్యదర్శి కామర్తి రమేష్, ఉత్సవ సమితి పెద్దలు ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలో తోటమైసమ్మ, అంబాభవాని దేవాలయంలో ఘనంగ బోనాలు నిర్వహించారు. అనంతరం పెద్దలు మాట్లాడుతూ మైసమ్మ దీవెనలతో ఈ ఏడాది ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ ప్రాంతంలో. రైతులు ఆదాయం పెంచుకోవాలన్నారు. ఆదివారం కుర్హిణి శెట్టికాలనీ, వీరభద్రకాలనీ, వీరన్నపేట, కిసాన్ నగర్ వాసులు తోటమైసమ్మకు బోనాలు సమర్పించారు. ఉదయం నుంచి అభిషేకం, అలంకరణ, అర్చన, మహానీరాజనం, బోనాల పండుగకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆగస్టు 4వ తేదీన విశేష అభిషేకం, అలంకరణ, నివేదన, అన్నదానం చేయనున్నట్లు వివరించారు. పూజారి జ్యోషి సంతోషాచార్యుల చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, పెద్దలు, కాలనీ యువకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

● బ్రైట్‌సిటీ కాలనీలో బోనాలు : పట్టణంలోని బైపాస్ పరిధిలోని బ్రైట్‌సిటీ కాలనీలో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు కాలనీ అధ్యక్షుడు పి.రవికిరణ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారికంగా నిర్వహించిన బోనాల పండుగను పర్వలు సంతోషంగా జరుపుకుంటున్నారని తెలిపారు. కాలనీ ఏర్పాటు తరువాత మొదటిసారి బోనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెన్నయ్య, ప్రభాకర్, యాదయ్య, శంకరయ్య, సాయిరెడ్డి, కాలనీవాసులు, మహిళలు బోనాలతో అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి

- ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు

పాలమూరు, జూలై 28 : ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆర్‌టీసీ-ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'కార్మిక ఉద్యమ చరిత్ర' అనే అంశంపై ఆయన బోధిస్తూ స్వాతంత్ర్యానికి పూర్వమే కార్మికవర్గం సంఘం ఏర్పాటు చేసుకుని అనేక హక్కులు, రాయితీలు బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి సాధించిందన్నారు. సమ్మె హక్కు, పోరాడే హక్కును బ్రిటిష్ ప్రభుత్వమే గుర్తించిందన్నారు. నేటి ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరిస్తూ కనీస వేతనాలు అమలు చేయకపోవటం దుర్మార్గమైందన్నారు. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక హక్కులను తీవ్రంగా అణచివేయాలని చూస్తోందన్నారు. సంఘం నిర్మాణం, సీఐటీయూ విశిష్టత అనే అంశాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి బోధించారు. 20ఏళ్లపాటు అనేకపోరాటాలు చేసి హక్కులు సాధించుకుంటే, నేటి కేంద్ర ప్రభుత్వం నేడు సంఘాలే ఉండరాదని, సమ్మెలు చేయరాదని, పోరాటాలే ఉండరాదని ఆంక్షలు విధిస్తుందన్నారు. పోరాడే వారిపైన రాజద్రోహం కేసులు బనాయించటం కార్మిక చట్టాలను నిర్వీర్యం పరుస్తున్నారని ధ్వజమెత్తారు. 30వ తేదీన చేపట్టిన చలో హైదరాబాద్‌కు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. ఆశ వర్కర్లు ఐక్యంగ పోరాడి వేతనాల పెంపుకోసం ఉధృత పోరాటాలు చేయాలని జిల్లా అధ్యక్షులు దీప్లానాయక్ పిలుపునిచ్చారు. ఆశా యూనియన్ నాయకులు సాధన, భాగ్య, మహాలక్ష్మి, బి.చంద్రకాంత్, గాలెన్న, వెంకటేష్ ప్రసంగించారు.

మిత్రుడికి ఆర్థిక సాయం



మిత్రుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

గండీడ్, జూలై 28 : చిన్ననాటి మిత్రుడు చెట్టుపై నుంచి కింద పడి, అనారోగ్యానికి గురై, ఆర్థికంగా అవస్థలు పడుతున్నందున అతనికి తోటి స్నేహితులు ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ 2003-04 సంవత్సరంలో గండీడ్‌లో పదవ తరగతి చదువుకున్నాడు. ఇటీవల అతను గ్రామంలో చెట్టుపై నుంచి పడి కాలు విరిగి, దీర్ఘకాలం చికిత్స తీసుకుంటున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి బాగాలేనందున పదవ తరగతి బ్యాచ్ మిత్రులు రూ. 13, 900 ఆర్థిక సాయం అదజేశారు. మా తోటి మిత్రుడు ఎవ్వరు ఇబ్బందిలో ఉన్నా మా మిత్ర బృందం ఆర్థిక సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, శేఖర్‌చారి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

'కురువ విద్యార్థులకు అండగా ఉంటాం'

పాలమూరు, జూలై 28 : మాదాసి, మాదారి కురువ ఉద్యోగుల సంక్షేమ సంఘం కురువ విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విజయ భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ధన్వాడ రాములు మెమెంటోలు అందజేశారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కె.కృష్ణయ్య, పి.జయప్రకాష్‌లను సన్మానించారు. కార్యక్రమంలో శివన్న, బాలయ్య, భరత్‌బాబు, వేణుగోపాల్, సునిల్, మల్లేష్, మాధురి, మహేశ్వరమ్మ, గోకారిలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలి : సీపీఎం

పాలమూరు, జూలై 28 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందజేయాలని సీపీఎం నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రిలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్డియాలజిస్టు, న్యూరాలజిస్టు, యూరాలజిస్టు, రేడియాలజిస్టు, ఆప్తమాలజిస్టు, జనరల్ ఫిజీషియన్, నెఫ్రాలజిష్టు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసుపత్రిలో బాత్రూంలకు కనీసం తలుపులు లేకపోవటం సిగ్గుచేటన్నారు. కిటికీలులేక దుర్వాసన, వార్డుల్లోకి ఈగలు, దోమలు సహజంగానే రాజ్యమేలుతున్నాయని తెలిపారు. రోజుకు వేయిమంది రోగులు వస్తున్న ఆసుపత్రి నుంచి హైదరాబాద్‌కు రోగులను పంపకుండా ఇక్కడే వైద్యసేవలు అందజేయాలన్నారు.

బడ్జెట్‌లో కులవృత్తులకు తీవ్ర అన్యాయం

- మాజీ ఎంపీపీ వెంకటాచారి

బాలానగర్, జూలై 28 : తెలంగాణ రాష్ట్రం బడ్జెట్ 2024-25లో అన్ని రకాల కులవృత్తులను పట్టించుకోకుండా బడ్జెట్ వివక్ష చూపించి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మాజీ వైస్‌ఎంపీపీ వడ్ల వెంకటాచారి శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఆసరా పెన్షన్, దళితుకు, గొల్ల కురుమలకు, ముదిరాజ్‌లకు అన్యాయం చేశారని అన్నారు. దళిత బందును రూ.10లక్షలు మాజీ సీఎం కేసీఆర్ ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారికి రూ. 12లక్షలు ఇస్తామని వారితో ఓట్లు వెయించుకొని అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను విస్మరిస్తున్నారని అన్నారు. బడ్జెట్‌లో ఎక్కడ దళిత బందు పథకం గురించి ప్రస్తావన లేదన్నారు. గొల్లకురుమలు ఆర్థికంగా బాగుపడాలని కేసీఆర్ పథకం తీసుకవస్తే బడ్జెట్‌లో ఎలాంటి మాటలేదన్నారు. వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ పెంచుతామని అనుకున్నామని, కానీ వాళ్లకు కూడా పెంచడానికి ఎక్కడ మాట్లాడలేదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట రూ.20వేల కోట్లు పెంచుతామని చెప్పి కేవలం రూ.7వేల కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు.

దివంగత సూదిని జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



జైపాల్‌రెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవి కుమార్



మిడ్జిల్‌లో జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగ, జూలై 28 : మాజీ కేంద్ర మంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి సేవలు ఎన్నటికీ మరువలేనిమని జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్ అన్నారు. జైపాల్‌రెడ్డి 5వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం జేపీఎన్‌సీఈ కళాశాలలో ఉన్న ఆయన విగ్రహానికి రవికుమార్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో వివిధ శాఖలకు మంత్రిగా పనిచేసిన ఆయన ఆ శాఖలకే వన్నె తెచ్చారని గుర్తు చేశారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. 1997లో జేపీఎన్‌సీఈ కళాశాల ఆయన ప్రోత్సాహంతోనే ఏర్పాటు చేసినట్లు రవి కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ సుజీవన్‌కుమార్, డీన్ డాక్టర్ కృష్ణమూర్తి, సందీప్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిడ్జిల్ : ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి వర్ధంతి వేడుకలను ఆదివారం మిడ్జిల్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో పాటు పేద ప్రజల అభ్యున్నతికి జైపాల్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు గౌస్, మల్లికార్జున్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నర్సింహ, శివప్రసాద్, నర్సింములుగుప్తా, రాములు, పర్వతాలు, వెంకటేష్‌గౌడ్, జహంగీర్, జహీర్, లక్ష్మారెడ్డి, శివ ఉన్నారు.

భూత్పూర్ హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం



ఢిల్లీ పీస్‌యూనివర్సిటీలో డాక్టరేట్ అందుకుటున్న శ్రీనివాస్

భూత్పూర్, జూలై 28 : భూత్పూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌కు ఢిల్లీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనిర్సిటీ అధికారులు డాక్టర్ పరేందర్‌సింగ్, డాక్టర్ వీపిన్‌గౌర్, తంగరాజు, వల్లర్‌మతి, శుభాసీస్‌సహా, బోడాసు మాధవి తదితరుల చేతుల మీదుగా ఆదివారం శ్రీనివాస్ డాక్టరేట్ అందుకున్నారు. కరోనా సమయంలో విశేష సేవలు అందించి, కరోనా పరీక్షలు చేసే సమయాల్లో రిస్కును ఎదిరించి ఎంతో మందికి సేవలు అందించినందుకుగాను, అదే విధంగా సామాజిక సేవల్లో చురుకైన పాత్ర పోశించిన సందర్భంగా పీస్ యూనిర్సిటీ వారు గుర్తించి డాక్టరేట్ అందించారని శ్రీనివాస్ తెలిపారు. చిరుద్యోగిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న అతనికి డాక్టరేట్ రావడం చాలా సంతోషంగా ఉందని మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రబ్, సీహెచ్‌వో ఆయాఫ్‌ఖాన్, సిబ్బంది తదితరులు ప్రత్యేక అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

పంటలకు నీటిని పొదుపుగా వాడుకోవాలి

దేవరకద్ర, జూలై 28 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద రైతులు సాగు చేసుకున్న పంటలకు నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాల్వల ద్వారా రైతులు సాగు చేసుకున్న పంటలకు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశామని పేర్కొన్నారు. మొదటి విడత 10 రోజుల పాటు విడుదల చేస్తామని, మరో 10 రోజుల తరువాత ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. రైతులు పంటలకు విడుదల చేసిన నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి పూర్వవైభవం

- శిల్పాకళాసంపద కనిపించేలా ఏర్పాట్లు

జడ్చర్ల, జూలై 28: వెయ్యేళ్లనాటి నుండి వంశపారంపర్యంగా అధినంలో ఉన్న ఆలయానికి పూర్వవైభవం తీసుకవచ్చేలా పనులను ప్రారంభించారు. ఆలయంలోని పూర్వవైభవ పనులు ఆదివారం ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వంశపారంపర్య ధర్మకర్త నరహరి భీంసేనాచార్య, ఆలయ పూజారి సుదీంద్రచార్యల ఆధ్వర్యంలో మరమత్తు పనులను కొనసాగిస్తున్నారు. ఆలయం ప్రకారపు మండపాలపై రంగులు వేయడంతో గోడలపై రాతి కట్టడానికి ఉన్న శిల్పాకళ ఖండాలు మూసుకపోయాయి.

దీంతో పూర్వపు శిల్పాకళను భక్తులకు కనిపించేలా ఏర్పాట్లను చేసేందుకు గల నాలుగురోజుల నుండి పనులను చేపట్టారు. ఆలయానికి పూర్వ వైభవం తీసుకరావడంతో పాటు రాతి శిల్పాకళతో ఆలయం మరింత సుందరంగా కనిపించనున్నట్లు వారు తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వారు అన్నారు.

నేడు జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 28 : వరంగల్ జిల్లాలో సరూర్‌నగర్ స్టేడియంలో జాతీయ జావెలిన్ డే సందర్భంగా ఆగస్టు ఏడున జరగనున్న రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొనే జిల్లా అండర్-14, 16, 18, 20 సంవత్సరాల లోపు బాల, బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 29న స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సెక్రటరీ శరత్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో రిపోర్టు చేయాలని, ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధ్రువపత్రం, ఆధార్‌తో హాజరుకావాలని కోరారు. మరింత సమాచారం కోసం 9440656162 నంబర్‌ను సంప్రదించాలన్నారు.